# ఆనవాయితీ

- సుశీలా రమణమూర్తి



"ఏఁవండీ! మనకి అర్జంటుగా ఓ తోటమాలి కావాలి. వాడికో పదో పరకో పారేస్తే-ఇటు తోట పని-అటు చిల్లరమల్లర పనులు కూడా వాడిచేత చేయించుకో వచ్చు. ఏఁవంటారు?"

"ఏఁవంటాను? - శ్రీమతిగారి చిత్తమంటాను."

*    *    *

"అమ్మగోరూ! మొక్కలకు నీళ్లు పోసేసానండి. సినబాబుగోర్ని- పెదబాబు గోర్ని తఁవరు 'రడీ' సేసేస్తే నాను సిటంలో ఆల్ని ఇస్కూలికి తోలుకుపోతా నండి."

"మేమొచ్చింది ఇంకా నిన్ననేగా. వాళ్ళని యింకా స్కూలులో జాయిన్ చేయలేదు. ఆ సంగతలా వుంచుగాని, యిక్కడ బజార్లో మంచికూరలు గట్రా ఏఁవైనా దొరుకుతాయా? "

"దొర్కుతాయా? — అంటారేటండి!! తల్లి మాలచ్చిమి వుంటే కొండమీది కోతిని కూడా దింపొచ్చు కదండీ !!

"అయితే ఈ పదిరూపాయలు పట్టు కెళ్లి —ఓ అరకేజీ వంకాయలు ఓ కేజీ బంగాళాదుంపలు—ఓ అనపకాయ . వేగంగా పట్రా! సంచి కావాలి కదూ? — ఆ మూల్నుంది తీస్కెళ్ళు "

"అలాగేనండి "

"ఇదిగో నీ పేరేఁవిటో నాకు తెలి యదు గాని—"

"రాఁవుండంటారండీ!"

"రాఁవుడో - దేఁవుడో ఏదైతేనేం గాని బెండకాయలు తాజాగా వుంటే ఓ కేజీడు కూడా పట్రా!"

"అలాగేనండి "

*    *    *

"ఈ ఊర్లో శ్రీవారి బుఱ్ఱ మహా యమాగా పన్జేస్తుందే!"

"అసలు సంగతేఁవిటో చెప్పు. ఏదైనా సినిమాకి తీస్కెళ్ళమంటావా చెప్పు తీస్కెళ్తాను. ఎందుకొచ్చిన ఈ కాకా !?"

"అబ్బబ్బబ్బ! ఎప్పుడు చూసిన ఈ కాకాలు - బట్టరింగులేదా? —"

"అయితే సంగతేఁవిటో చెప్పవోయ్!"

"ఉదయం ఏడుగంటలకి చెప్పిన విష యం - మరో గంటలోనే కార్యరూపం ధరించినందుకు నాకెంతో ఆశ్చర్యంగా వుందండి. ఈ శ్రీవారు ఇంతకీ మా శ్రీ వారేనా!?- అని ఇలా చెప్పిందే తడవుగా అలా తోటమాలిని కుదిర్చినందుకు నేనే మిమ్మల్ని సినిమాకి తీస్కెళ్దామనుకుం

టున్నాను. కనుక సాయంత్రం కాస్త వేగంగా రండి.''

''నే నేంవిటి? తోటమాలిని కుదర్చడ మేంవిటి,?? నీకేమైనా మతుందా?- లేదా!?

''అబ్బబ్బ! ఏంవీ ఎరుగనట్లు ఎంత ఇదిగా మాట్లాడుతున్నారండి? నా చేతిలోనే గనుక పద్మశ్రీలుంటే మీ మెళ్లో పద్మశ్రీల మాలనే వేసి వుందును. ఎందు కనుకున్నారు? మీ నటనా చాతుర్యానికి!''

''అంటే ఎవడో నీ కంట్లో కారం గొట్టాడన్న మాట! ఎందుకైనా మంచిది కొత్తిల్లు—కొత్త ప్రదేశం ఇక మీదు ట్నుంచైనా జాగ్రత్తగా వుండు. ముందు సామాన్లన్నీ జాగ్రత్తగా వున్నాయో లేదో చూడు,''

"ఎందుకండీ మీరలా కంగారు పడి పోతారు? నా కంట్లోనే కారం గొట్టడానికి ఎన్ని గుండెలుండాలి ఎవడికైనా,''

''అవును నీవు సూర్యకాంతం చెల్లాయివని నాకు తెల్సినట్లు అందరికీ తెలియదు కదూ?''

''ఏంవిటండీ! మీలో మీరే గొణుక్కుంటున్నారు?''

'తమరి కంట్లో దుమ్ము కొట్టినవాడి గురించి ఆలోచిస్తున్నాను ఇప్పటికైనా ఇంట్లో వస్తువులన్నీ వున్నాయో లేదో చూస్తారా,''

''అబ్బో మీరు నన్ను మన్నించి మాట్లాడుతున్నారే అంటే శ్రీవారికి— కోపం వచ్చిందన్న మాట? ఇదుగో ఇటు చూడండి, మీ కంత అనుమానం వుంటే మీ వస్తువులన్నీ సరిగ్గా వున్నాయో లేదో చూసుకోండి. నాకూడా ఆ శ్రమదేనికి?''

''ఇంతకీ మన వరండాలో అలా గురక పెట్టి నిద్రపోతుం దెవరు?''

''అబ్బ! మీరింకా 'యాక్షన్' చంచేస్తున్నారండి? ఆ ఎవర్ గ్రీన్ హీరో మీ ముందు దిగదుడుపేనంటే నమ్మండి మీకు అక్టరాక్ పద్మశ్రీ యేం ఖర్మ! పద్మ విభూషణే ఇస్తాను''

''అనవసరపు డబ్బా కట్టిపెట్టి వా డెవడో చెబుతావా, లేదా?—''

''హుం, అయితే బాగా వినండి, వాడే మీరు పంపిన తోటమాలి!''

''అలా అని వాడు చెప్పాడా?''

''వాడేం చెప్పలా — 'అమ్మగోరూ! మొక్కలకి నీళ్లు పోసేసానండి సినబాబు గోర్ని! పెదబాబుగోర్ని తంవరు రడీ సేస్తే నాను పిటంలో ఆళ్ల ని ఇస్కూలుకి తీసుకు పోతానండి!' అంటే వాడిని మీరే పంపించారనుకున్నాను.''

''ఆహా!''

''ఏంవండీ! అయితే నిజంగా మీరు వాడిని పంపించలేదా!?''

''లేదు''

''వాడి సంగతి తర్వాత కనుక్కుందురు గాని-ముందు భోజనానికి లేవండి''

''ఆ సంగతి తెల్పుగాని, ముందు నీవు కాస్త ''

''నోరు మూసుకుని లోపలికి వెళ్ళ మంటారు అంతేనా?

'' ''

* * *

'ఓయ్! నిన్నే! ఎవర్నువ్వు?''

"నానాండి! నానాండి! నాను రాంవుణ్ణండి!''

ట్వింకిల్ ట్వింకిల్ ఫిల్మీస్టార్!

లక్ష్మిచేసే ప్రతి కేరక్టర్‌లోనూ
ఉంటుందో గమ్మత్తు
లక్షలు మించి చేస్తాయి ఆ మహానటి
హావభావాల కిమ్మత్తు
వెండితెరకు ఆమె నటన సాటిలేని
రివార్డ్
అందుకు ప్రతిగా అభిమానులు
అందిస్తారు అభినందల ఎవార్డ్.

—జి. యస్. సూరి



"నీ పేరు కాదు నే నడిగింది - నీ వెవరివని? ఎందుకిక్కడికి వచ్చావని?"

"తం వ రి కి తెలవ నట్లడుగుతా రే ఓండి?"

"నిజంగానే నీ వెవరో నాకు తెలియదు"

"నేను రాంవణ్ణండి"

"ఇదివరకే చెప్పావుగా ఎందుకొచ్చావో చెప్పు."

"పనిసేయడానికండి!"

"నీకు ఉద్యోగం లేదా?"

"మా బలేవారండి! నాకుద్దేగం లేకపోటమేమిటండి?"

"ఐతే నీకు వస్తున్న జీతం చాలటం లేదన్నమాట!"

"సాలకపోడమేటండి? ఒకుద్దోగానికి రెండు జీతాలైతేను?"

"ఏంవిటీ ఒక ఉద్యోగానికి రెండు జీతాలా?"

"అవునండి. ఒకటి పెద్ద జీతం! రెండోది పిల్ల జీతం"

"ఆ చెప్పేదేవో అర్థమయ్యేట్లు చెప్పవోయ్!"

"ఏటండి తంవరికి ఆ మాత్తరం అరదం కాదా?"

" "

"నాను మీ ఆఫీసులో పూన్నండి!"

"వాట్! నీవు మా ఆఫీసులో ప్యూనివా?"

"అవునండి"

"మరి ఆఫీసుకి రావేంటిం? లీవ్ అప్లై చేశావా?"

"ఏంటండి? - మీరు మరీను! ఎనకటికి ఓ పాతబాబుగోరు కూడా ఓతూరిలానే పరాసికం ఆడేరు నాతో. ఏంటో! - మీ వోల్లతీరంతా ఒకటే బాబూ!"

"మరోసారి చెబుతున్నాను ఆ చెప్పేదేదో సూటిగా అర్థమయేలా చెప్పు"

"ఉత్తిపున్నేనికి అలా కోప్పడ్తారేటండి? నానుముందే సెప్పేను కదండి! మీ ఆఫీసులో పూన్నని! నా ఇరవయ్యేల సరివీసులో పందొమ్మిదేల్ల సిల్లర నానెప్పుడూ ఆఫీసు ముకం సూల్లేదండి— ఏదో పెతినెల జీతానికి తప్ప! ఒకోసారి

ఆ కేసీరు బాబే నాకాడ కొచ్చేసి. యేలి ముద్దరేయించుకుని జీతం యిస్తుంటా రండి. ఆ బాబు మా దొడ్డబాబునెండి.''

''అయితే నీ వెప్పుడూ ఆఫీసుకి వెళ్ళ వన్నమాట!!''

"ఆ అవుసురం నాకు నేదండి ''

''అయితే రోజూ నీవేం జేస్తుం టావ్?''

''సేసేదేంవుంది? - నిన్నటిదాకా ఆ పాత మానేజరు గోర్కి యేంవి సేసానో తంవకి కూడా అదే సేస్తానండి ''




''నీవిలా ఆఫీసు పని చేయకుండా— ఆఫీసర్ల సొంతపనులు చేస్తున్నట్లు పై అధికార్లకి తెలిస్తే నీ. ఉద్యోగం ఏమౌ తుందో తెలుసా?''

''ఆ బయం నాకు నేదండి నానాఫీ సుకి పోకపోయినా - ఎల్లినట్టు, నెల్లో జులో తూరి నావెత్తన్న యేలిముద్దరలు న్నాయి కదండి! ఒకేల మీరన్నట్టు ఈయి సయం పెద్దోల్లకి తెలిస్తే-ఈడున్న పెద్దో ల్లకి లేని భయం నాకెందుకండి? ఆఫీ సుకో పనిసేసినా - సేయకపోయినా నా జీతం నాకొత్తాది కదండి? ఇక పోతే మీలాంటి పెద్దోల్లు నా కట్టం ఎలాగూ వుంచుకోరు కదండి?''

''అయితే రాంవుడూ! ఒక మాటడుగు తాను సూటిగా సమాధానం చెబుతావా?''

''అడగండి, మరి!''

'నేను మా ఇంటికి నిన్ను రమ్మన కుండా ఎందుకొచ్చావ్?''

''మా బలేవారండి మీరు!? ఇది నా లాటోల్లందరికీ 'అనవాయితీ' అయితే మద్దిలో మీకు సెప్పేదేటండి? ఇలా సేయ లేదనే నిసకార్నింగా ఆ మద్దిన మా వా డొకడి వుద్దేగం పోనాది కదండి!''

" "

''ఏంటి. బాబూ! అలా నా ముకంలోకి సోద్దెంగా సూస్తున్నారు మీ గురించి అమ్మ గారు ఎదురుచూస్తున్నారు. ఎల్లి నాలుగు మెతుకులు ఎంగిలి పడండి. నానలా ఇంటి కాడ కెల్తొస్తాను.'' ★